



రేపల్లె: మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందిస్తున్న మంత్రులు అనగాని,పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి



పర్చూరు : వ్యవసాయ మార్కెట్‌లో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు




బాపట్ల: మార్కెట్‌యార్డులో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ



చీరాల: పాపాయపాలెం గ్రామంలో అన్నదాత సుఖీభవ చెక్కును రైతులకు అందజేస్తున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

అన్నదాత.. సుఖీభవ



కొల్లూరు : ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం చెక్కును రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నా కాల్వల్లో సాగునీరు పరవళ్లు తొక్కుతుండగా.. వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఈ సమ యంలో ప్రభుత్వం శనివారం 'అన్నదాత.. సుఖీభవ' అంటూ రైతు ల ఖాతాల్లో నగదు జమ చేసింది. పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న తరుణంలో రూ.7 వేలు నగదు అందడంతో అన్నదాతల్లో ఆనందో త్సాహాల్లో తేలియాడు తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా సూపర్ సిక్స్‌లో పథకాలను ఒక్కొక్కటి అమలు చేస్తోంది. ఈ క్రమంలో అన్నదాత సుఖీభవ పథకం అమలు ఎప్పుడె ప్పుడా అని రైతులు చూస్తున్న తరు ణంలో



బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావడంతో కర్షకుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. జిల్లాలో అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ పథకాన్ని శనివారం పండుగ వాతావరణంలో ప్రజాప్రతినిధులు, అధికా రులు లాంఛనంగా ప్రారంభించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు ఎక్కడికక్కడ ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కంటే రూ.6,500 అదనంగా కూటమి ప్రభుత్వం అందస్తుం డటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్థిక సాయంతో ఆనందోత్సాహాలు

- రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.7 వేలు జమ
- జిల్లాలో వేడుకలా సుఖీభవ పథకం ప్రారంభం
- 1,60,441 రైతులకు రూ.108.47 కోట్లు పంపిణీ



వినుకొండ : మార్కెట్ యార్డులో చెక్కును పంపిణీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్‌బాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత కొన్ని రోజులుగా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు సంబంధించి అధికారులు పెద్దఎత్తున కసరత్తు చేశారు. జిల్లాలోని ఏ రైతూ నష్టపోకుండా అర్హులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో తొలుత ప్రభుత్వం గత నెలలో జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి అనర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. జిల్లాలో 2,39,959 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు ఏర్పాట్లు చేసింది. దీంతో జిల్లాలోని 1,60,441 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ రూ.2000, సుఖీభవ రూ.5000 వేర్వేరుగా రూ.108.47 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. తొలుత రూ.2,000 జమైనట్లుగా, ఆ తర్వాత రూ.5000 ఖాతాల్లో నగదు పడినట్లు వచ్చిన సందేశాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ క్రాప్ నమోదు చేసుకున్న కౌలు రైతులకు మాత్రమే సుఖీభవ అందుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

అట్టహాసంగా కార్యక్రమాలు

జిల్లా స్థాయిలో అన్నదాత సుఖీభవ పథక ప్రారంభోత్సవం రేపల్లె మార్కెట్‌యార్డు వేదికగా అట్టహాసంగా జరిగింది. ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వెంకటమురళి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి రైతులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి కొలుసు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అమలు చేశామన్నారు.

కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో అన్నదాత సుఖీభవ పథకాన్ని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ప్రారంభించారు. టీడీపీ జెండాలో నాగలి గుర్తు ఉందని, ప్రతి ఎ జెండా రైతు సంక్షేమమే ధ్యేయంగా ఉం టుందన్నారు. అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యం అని నమ్మిన పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు.



తాడికొండ : లాం ఫాంలో రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

బాపట్ల మార్కెట్‌యార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రైతులకు చెక్కులు అందజేశారు. పథకం లబ్ధిలో ఎవరికైనా సందేహం ఉంటే 155251 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవచ్చన్నారు.

పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని ఆయన తెలిపారు.

పాపాయపాలెం గ్రామంలో రైతులతో కలిసి పథకం నిధులు విడుదల కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు.

అద్దంకి ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినుకొండ మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రతి ఏటా రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని గొట్టిపాటి తెలిపారు.

శాశ్వతం.. స్నేహితం

- కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు..
- నేడు స్నేహితుల దినోత్సవం..

8

త్వరలో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు!

- సూపరింటెండెంట్ రమణ యశస్వి



- విద్యార్థుల ఆనందోత్సాహం



- గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య వీసీ నాగభూషణ్ తదితరులు

8

- క్వాంటం టెక్నాలజీకి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్
- విజ్ఞాన్స్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ముగ్గురికి గౌరవ డాక్టరేట్లు.. 2122 డిగ్రీలు.. 60 బంగారు పతకాల పంపిణీ

సాంకేతిక నగరంగా అమరావతి

బళ్ళారి జీవితం స్ఫూర్తిదాయకం

చిత్రపటానికి నివాళులర్పించిన అధికారులు

బాపట్ల రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బళ్ళారి రాఘవ కేవలం నటుడే కాదని, సామాజిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన కళాకారుడని ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జేసీ గంగాధర్‌గౌడ్ తెలిపారు. రంగస్థల నటుడు సామాజిక సంస్కర్త బళ్లారి రాఘవ జయంతి



బళ్ళారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి

బాపట్ల కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ గంగాధర్, ఆర్డీవో గ్లోరియా, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, కలెక్టరేట్ సిబ్బంది బళ్ళారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బళ్ళారి తన నాటక ప్రదర్శనల్లో భావోద్వేగాలకు, వాస్తవికతకు ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. ఆయన నాటకాలు సమాజాన్ని చైతన్యపరిచేలా ఉండేవని కొనియాడారు.

ఏబీసీ కాల్వకు.. సాగర్ నీరు

- నీటి ఉధృతితో కొట్టుకుపోయిన డైవర్షన్
- వంతెన పనులకు ఆటంకం.. రాకపోకలు బంద్

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అద్దంకి బ్రాంచ్ కాల్వ(ఏబీసీ) ఆయకట్టుకు శనివారం సాగునీరు విడుదలైంది. దీంతో ఏబీసీ కాల్వ వల్లాపల్లి సమీపంలో 33వ మైలు వద్ద నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెన పనులకు ఆటంకం కలిగింది. తొలుత సాగర్ నుంచి విడుదలైన నీరు వంతెన పనులు ముగిసే వరకు ఏబీసీ కాల్వకు రాదని అధికారులు ప్రకటించారు. అయితే ఎగువ నుంచి అత్యధిక ఉధృతితో నీరు రావడంతో అధికారులు చేసేది లేక 600 క్యూసెక్కుల మేర దిగువకు వదిలారు. దీంతో హైలెవల్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్‌కు వేసిన మట్టి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో బల్లికురవ అద్దంకి రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన పనులు జరుగుతుంటే ఈ స్థాయిలో నీటిని ఎలా విడుదల చేశారని కొందరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి ఉంటే ఏబీసీ కాల్వపై వంతెన పనుల్లో జాప్యం జరుగుతుందని పలువురు అంటున్నారు. ఎన్ఎస్పీ ఈఈ సతీష్, డీఈ రామకృష్ణ, జేఈ క్రాంతికుమార్‌లు కాల్వలో నీటి ఉధృతిని పరిశీలించి మిగిలిన కాల్వలకు మళ్లించారు. నీటి ఉధృతి తగ్గగానే పనులు చేపట్టేలా చూస్తామన్నారు.



ఏబీసీ కాలువ కట్టపై ఏర్పాటు చేసిన డైవర్షన్ నీటిలో కొట్టుకుపోయి కోతకు గురైన మట్టి



కాలువ కట్టకు గండి పడకుండా యంత్రంతో కట్టకు మట్టిని నింపిస్తున్న అధికారులు

వ్యవసాయ సీజన్‌లో పనులపై రైతుల ఆందోళన

వేసవిలో పనులు చేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవసాయ సీజన్‌లో అదీ నీరు విడుదల సమయంలో చేయటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎన్ఎస్పీ, ఆర్‌అండ్‌బీ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం తమ పాలిట శాపంగా మారిందని రైతులు తెలిపారు.

ఐదు దశాబ్దాలుగా.. సాగుకు వెతలు

పెరవలిపాలెం చానల్‌పై అడ్డుగోడ.. నీటి పారుదలకు ఇబ్బంది

వేమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలిపాలెం చానల్ పరిధిలోని 2300 ఎకరాల రైతులు ఐదు దశాబ్దాల నుంచి సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పెరవలిపాలెం చానల్ ద్వారా పెదరావూరు, మూల్పూరు భూములకు సాగునీరు అందాలి. అయితే 50 ఏళ్ల క్రితం పెరవలిపాలెం చానల్‌కు అడ్డుగా గోడ నిర్మించారు. దీంతో పెరవలి, పెరవలిపాలెం గ్రామాల పరిధిలోని భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో మురుగునీటి ఆధారంగా రైతులు ఖరీఫ్ సాగు చేసుకునేవారు. అయితే కాల్వల కింద గతంలో ఏర్పాటు చేసిన మురుగునీటి పైపులను కూడా తొలగించారు. మురుగునీటి కూడా పారుదల ఆగి పోవడంతో చేసేదిలేక భూగర్భ జలాలపై ఆధారపడి రైతులు



పెరవలిపాలెం చానల్‌పై లెవెల్ పెంచి కట్టిన గోడ



పెరవలి వద్ద నెర్రెలిచ్చి దెబ్బతింటున్న వెదసాగు

సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మోటార్లకు రోజుకు ఎనిమిది గంటల మాత్రమే సరఫరా ఇవ్వడంతో ఆ నీరు సరిపోక పంటలు ఎండిపోవడంతో రైతు లు అల్లాడుతున్నారు. కనీసం 14 గంటలు విద్యుత్ సరఫరా ఇస్తే కానీ ఖరీఫ్ సాగుకు నీరు పెట్టుకునే అవకాశం ఏర్పడుతుందంటున్నారు. ఎత్తుగా కట్టిన లెవలింగ్ గోడ ప్రమాణాన్ని తగ్గించి తమ భూములకు సాగునీరు అందించాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

అందరూ కలిస్తేనే పరిష్కారం..

ఐదు దశాబ్దాల నుంచి ఉన్న సమస్యపై నీటి సంఘాల ప్రతినిధులు, అధికారులు, రైతులు చర్చించి నిర్ణయం తీసుకుంటేనే పరిష్కారమవుతుందని నీటి పారుదల శాఖ ఏఈ శివరామకృష్ణ తెలిపారు. ఎత్తుగా కట్టిన గోడ లెవల్ తగ్గిస్తే మూల్పూరు తదితర ప్రాంతాల్లోని భూములకు నీరు సక్రమంగా అందదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గురజాలటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని హైవే మలుపు వద్ద బైకు అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. అంజనాపురం గ్రామానికి చెందిన కాసాని నాగిరెడ్డి (40) దాచేపల్లి వెళ్తుండగా.. బైకు అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. స్థానికులు నాగిరెడ్డిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అనుపు కృష్ణా జలాశయంలో బుధవారం గల్లంతైన మత్స్యకారుడు దోనె ధనరాజు (40) మృతదేహం శనివారం లభ్యమైంది. విజయపురి సౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో రెండు రోజులుగా జలాశయంలో గాలించారు. అనుపునకు కిలోమీటరు సమీపంలో ధనరాజు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ధనరాజు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిచారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కాలువలో పడి వివాహిత మృతి

మాచర్లటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువలో ప్రమాదవశాత్తూ పడి వివాహిత మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణ శివారులో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. రెంటచింతల మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన పతకమూరి లక్ష్మమ్మ (55) మాచర్ల పట్టణ శివారులోని కంభంపాడు బ్రిడ్జి వద్ద నాగార్జున సాగర్ కుడి కాలువలో ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందింది. గట్టునే ఉన్న ఆలయానికి శ్రావణ శుక్రవారం పూజలు చేసేందుకు ఆమె వెళ్లింది. శనివారం ఉదయం బుగ్గవాగు రిజర్వాయర్ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. లక్ష్మమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేశారు.

పులిచింతలకు 1,36,683 క్యూసెక్కులు

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రాజెక్టు ద్వారా పులిచింతలకు 1,36,683 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ నుంచి 1,65,726 క్యూసెక్కులు నీరు వస్తుండగా 9 గేట్లను 3 మీటర్ల మేర ఎత్తినట్లు అధికారులు పేర్కొన్నారు .రిజర్వాయర్‌లో 74.57 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.455 టీఎంసీలకు, 247 అడుగులకు సమానం.

సూపర్ సిక్స్‌లో.. నాలుగో హామీ అమలు

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్‌లో.. నాలుగో హామీ అన్నదాత సుఖీభవ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శనివారం బాపట్ల జిల్లా కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలన్ని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నామన్నారు. అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచక, రాక్షస, విధ్వంస పాలనతో రాష్ట్రం 30 ఏళ్ల తిరోగమనంలోకి వెళ్లిందని ఆనందబాబు విమర్శిం చారు. 13 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత, మంత్రి నారా లోకేశ్ పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. వేమూరు నియోజకవర్గ పరిధిలోని 27,965 మంది రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు రూ.18.95 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. కౌలు రైతులకు కూడా రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పూర్ణకుమారి, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

● సురక్షితంగా తల్లికి అప్పగింత


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

రేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బాలుడి కిడ్నాప్ కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించినట్లు డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. కిడ్నాపర్ చరణ్‌ను విజయవాడ బస్టాండ్‌లో అరెస్ట్ చేసి, బాలుడు భాను సిద్ధార్థను తల్లికి అప్పగించినట్లు వెల్లడించారు. ఈ మేరకు.. శనివారం తన కార్యాలయంలో డీఎస్పీ విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పట్టణంలోని నివాసం ఉంటున్న ఉప్పాల శ్రీలక్ష్మి, ప్రసాద్ దంపతుల కొడుకు.. నాలుగేళ్ల భాను సిద్ధార్థ. మనస్పర్థల కారణంగా భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. భాను సిద్ధార్థ స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్లో ఎల్‌కేజీ చదువుతూ తల్లివద్ద ఉంటున్నాడు. శ్రీలక్ష్మిని తనతో ఉండాలని నిందితుడు చరణ్ అనే వ్యక్తి పలుమార్లు వేధించాడు. దానికి ఆమె నిరాకరించడంతో శుక్రవారం సాయంత్రం స్కూల్ నుంచి వస్తున్న భాను సిద్ధార్థను బలవంతంగా ఆటోలో నుంచి దించి కిడ్నాప్ చేశాడు. దీనిపై తల్లి శ్రీలక్ష్మి ఫిర్యాదు చేయడంతో.. పట్టణ పోలీసులు బాలుడి కిడ్నాప్ కేసు నమోదు చేశారు. పట్టణ, వేమూరు సీఐలు.. మల్లికార్జున్‌రావు, ఆంజనేయులు నాలుగు బృందాలుగా బాలుడి కోసం గాలింపు చేపట్టారు. విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న చరణ్‌ను అరెస్టు చేసి కిడ్నాప్‌కు గురైన బాలుడ్ని రక్షించారు. బాలుడిని తల్లి శ్రీలక్ష్మీ చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐలను జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు. ఈ సమావేశంలో సీఐ మల్లికార్జున్ రావు, ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

60 మంది పిల్లలకు కేన్సర్ నిరోధక వ్యాక్సిన్

విజయవాడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మహేష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో బుర్రిపాలెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించి 60 మంది పిల్లలకు కేన్సర్ నిరోధక హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వాక్సిన్ (సర్వైకల్ కేన్సర్ రాకుండా) రెండో డోసు వేసినట్టు ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.వి.రావు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ ఆసుపత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నటుడు మహేష్‌బాబు కుమార్తె సితార పుట్టినరోజు సందర్భంగా మహేష్‌బాబు దత్తత బుర్రిపాలెంలో శనివారం ఆంధ్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించామన్నారు. బుర్రిపాలెంలోని ఘట్టమనేని నాగరత్నమ్మ పాఠశాల నుంచి వచ్చిన 148 మంది పిల్లలకు వైద్యపరీక్షలు జరిపి మందులు అందజే శామన్నారు. ఇప్పటి వరకు బుర్రిపాలెంలో 44 వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 35 గుండె వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు. యూకేకు చెందిన హీలింగ్ లిటిల్‌హార్ట్ చారిటీ కూడా ఆంధ్రా ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించిందన్నారు. డాక్టర్ సయోద్ ముదసిర్, డాక్టర్ భూగణేష్ పాల్గొన్నారు.

ఆనంద సాగర్

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ. లక్ష


సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 18 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పర్యాటకుల తాకిడి శనివారం భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి కుటుంబాలతో వచ్చి.. సాగర్ నూతన, పాత బ్రిడ్జి, లాంచీ స్టేషన్ ప్రాంతాల్లో సందడి చేశారు. లాంచీలలో నాగార్జున కొండకు తరలి వెళ్లారు. కొండలోని మ్యూజియం సందర్శించారు. పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంఫీ స్టేడియం, అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథ స్వామి దేవాలయం, ఎత్తిపోతల జలపాతం అందాలను వీక్షించారు. శనివారం లాంచీల ద్వారా రూ.1,00,450 ఆదాయం సమకూరినట్లు యూనిట్ అధికారులు తెలిపారు.

18 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు శ్రీశైలం నుంచి 2,10,499 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. శనివారం ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 18 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,36,656 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070, కుడి కాలువ ద్వారా 8023 , ఎడమ కాలువ ద్వారా 7937, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 1,83,786 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.30 అడుగులు ఉంది. 298.30 టీఎంసీలకు సమానం.


కొండను సందర్శించిన పర్యాటకులు

పశ్చిమ డెల్టాకు గరిష్ఠ స్థాయిలో నీటి విడుదల


దుగ్గిరాల హెడ్ స్లూయిస్ వద్ద నీటి విడుదల


బకింగ్‌హామ్ కాల్వలో గరిష్ఠ స్థాయిలో నీటి ప్రవాహం

దుగ్గిరాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యాక అత్యధికంగా 7,508 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో.. బ్యారేజీ నుంచి దిగువకు 1,89,652 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. మూడు రోజులుగా బకింగ్‌హామ్ కాల్వకు 6 వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తుండగా, మరో వెయ్యి క్యూసెక్కులు పెంచారు. సాగు నీటి కాల్వలు చాలా చోట్ల అంచులు తాకుతూ నీరు ప్రవహిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లాకుల వద్ద పహారా నిర్వహిస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 316, రేపల్లె కాల్వకు 1807, తూర్పు కాల్వకు 749, పశ్చిమ కాల్వకు 283, నిజాంపట్నం కాల్వకు 488, కొమ్మమూరు కాల్వకు 2900 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రేపల్లె కళాకారుడికి 'బళ్లారి రాఘవ' రాష్ట్రస్థాయి అవార్డు

● అనంతపురంలో ప్రదానం


అవార్డు అందుకుంటున్న భూపతి ధర్మారావు

రేపల్లె టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు కోసం బళ్లారి రాఘవ పరితపించారని డీఆర్వో మలోల అన్నారు. దీనికోసం ఆయన రంగస్థలాన్ని వేదికగా చేసుకున్నారని పేర్కొన్నారు. అనేక పౌరాణిక, సాంఘిక నాటకాలలో ఆయన జీవించారని కొనియాడారు. బళ్ళారి రాఘవ 145వ జయంతిని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్ ఆవరణలో శనివారం సాయంత్రం 'బళ్లారి రాఘవ' అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాజుల పద్మజ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డీఆర్వో, టౌన్ ప్లానింగ్ ఏడీ సువర్ణ తదితరులు హాజరై బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 2025 సంవత్సరానికి మేరిగె రామలింగేశ్వరరావు(తెనాలి), భూపతి ధర్మారావు(రేపల్లె)కు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డును అందజేసి సత్కరించారు. అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. కళాకారులు వెంకటరామిరెడ్డి, అరుణ్‌బాబు, ఎస్‌యం బాషా, జ్యోతిరాణి తమదైన శైలిలో నటించి మెప్పించారు. కార్యక్రమంలో లలితకళా పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్ సాగర్, వడ్డెర సంఘం నాయకుడు రాజేష్, నారాయణస్వామి, వెంకట సుబ్బయ్య, భగవాన్, రంగప్ప, రఘు, అస్లాంబాషా, లోకేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ వేత్తకు ప్రకృతి ప్రేమికుల మద్దతు


చెత్త సేకరణలో యువతతో.. అంకారావు

కారంపూడి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పర్యావరణ వేత్త, ఏపీ ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు అలియాస్ జాజి ఆశయానికి మద్దతు లభిస్తోంది. నల్లమల ఇతర అటవీ ప్రాంతాల్లో 5 కోట్ల మొక్కలు నాటాలనే ఆయన సంకల్పించారు. శనివారం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యావరణ, ప్రకృతి, అటవీ ప్రేమికులు విత్తనాలు, విత్తన బత్తులు భారీ స్థాయిలో తీసుకువచ్చారు. అడవులలో ఎత్తయిన కొండలు, గుట్టలు, కుంటలు ఎక్కి చల్లారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి నాశనం చేశారు. అంకారావు తన మూడు దశాబ్దాల అనుభవాలు చెప్పారు. అటవీ ఔషధ మొక్కలపై అవగాహన కల్పించి, తాను రాసిన పుస్తకాలు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన యూత్ ఫర్ సేవ సేవకులు, వన్ ఎర్త్, వన్ లైఫ్ అడ్మిన్ లీలాకుమారి ఏలూరి, సభ్యులు, సెక్రటరీ లక్ష్మి, పద్మసాయి పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో యువ ఇంజనీర్లు భాగస్వాములు కావాలి

● జేఎన్‌టీయూ(కే) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు
● ఘనంగా కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థినికి డిగ్రీ పట్టా అందజేస్తున్న జేఎన్‌టీయూ(కె) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు, కళ్ళం మోహనరెడ్డి

గుంటూరు(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, దేశాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని జేఎన్‌టీయూ(కే) రెక్టార్ ఆచార్య వీవీ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. చౌడవరంలోని కళ్ళం హరనాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి అధ్యక్షత వహించారు. ఆచార్య వీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడంతో పాటు ఉద్యోగాల కల్పనకు కృషి చేయాలన్నారు. అప్పుడే దేశ ప్రగతికి బాటలు పడతాయన్నారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించిన 11 సంవత్సరాల్లోనే ఎన్‌బీఏ, నాక్-ఏ గ్రేడు, స్వయం ప్రతిపత్తి(అటానమస్)హోదా సాధించి.. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో విద్యను అందిస్తున్నామని చెప్పారు. . ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, అకాడమిక్ డీన్ డాక్టర్ షణ్ముఖ రావు, స్నాతకోత్సవ డాక్టర్ సన్నీ డియోల్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కళ్ళం నవ్య, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నగదు జమపై రైతుల హర్షం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చందోలు రైతు సేవా కేంద్రంలో ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ.. పీఎంకిసాన్‌పథకం ద్వారా రూ.7 వేలు జమ అయిన సందర్భంగా టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాసీం, పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి సయ్యద్ జునేద్, టీడీపీనాయకులు షేక్ షాలెం, షేక్ అన్వర్, స్థానిక రైతులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తంచేశారు. అదేవిధంగా మండలవ్యాప్తంగా, సంగుపాలెం రైతు సేవా కేంద్రంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, గ్రామసర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, మాజీ ఎంపీపీ బొలగాని వెంకట సులోచన నారాయణ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, జాలాది లోకరాజ్యుడు, టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, కోడూరు, అలకాపురం, భవనవారిపాలెం గ్రామసర్పంచ్‌లు ఐనంపూడి శ్రీనివాసరావు, మోదుగుల శివనాగేశ్వరి, మంతెన గంగరాజు, కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చందోలులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే నరేంద్రవర్మ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

పీఎం వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కర్లపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ కింద కర్లపాలెం మండలంలోని 4,229 మంది రైతులకు 84 లక్షల రూపాయల నిధులు విడుదల చేశారని జిల్లా పంచాయతీరాజ్ అధికారి కేఎల్ ప్రభాకరరావు అన్నారు. కర్లపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ప్రారంభం సందర్భంగా పీఎం నరేంద్రమోదీ నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రభాకరరావుతోపాటు మండల అధికార యంత్రాంగం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది రజనీ, కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకం నగదు జమ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ.. పీఎంకిసాన్ పథకం ద్వారా మండలంలోని 9 రైతు సేవా కేంద్రాల పరిధిలో 2,081 మంది రైతుల ఖాతాలలో నగదు జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి సీహెచ్ సత్యానంద్ తెలిపారు. ఏవో సత్యానంద్ మాట్లాడుతూ రెండో విడత రూ.7 వేలు, మూడో విడత రూ.6వేలు మొత్తం రూ.20 వేలు రైతుల ఖాతాలలో ఈ ఏడాదిలోపే జమ చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

అమృతలూరు మండలంలో...

అమృతలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి రైతు ఖాతాల్లో అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్ భరత్‌కుమార్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దఫాగా రూ.5వేలు, పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు కలపి మొత్తం రూ.7 వేలు జమచేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలో 5533 మంది రైతులకు గాను రూ.2 కోట్ల 77 లక్షలు రైతు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

రెండు జాతీయ రహదారుల అభివృద్ధికి గడ్కరీ ప్రకటన

- సీఎం విజ్ఞప్తి మేరకు రూ.4605 కోట్లు మంజూరు

గుంటూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణ జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జిల్లా పర్యటన సందర్భంగా గుంటూరుకు రెండు భారీ ప్రాజెక్టులను ప్రకటించారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం సాయంత్రం జరిగిన సమీక్షలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు అప్పటికప్పుడు జాతీయ రహదారుల అభివృద్ధిని వేదికపైనే మంజూరు చేశారు. వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరసలుగా అభివృద్ధి చేసేందుకు రూ. 2,605 కోట్లు, గుంటూరు - నిజాంపట్నం జాతీయ రహదారిని రూ.2 వేల కోట్లతో నాలుగు వరసలుగా అభివృద్ధి చేసేందుకు సమ్మతించారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

- బాపట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గంటా

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గంలో రోజురోజుకి అభివృద్ధి కుంటుపడుతూ ఉందని, నియోజకవర్గ ప్రజాప్రతినిధిలు, అధికారులు తక్షణమే స్పందించి అభివృద్ధిపై దృష్టి సారించాలని బాపట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గంటా అంజిబాబు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు జగన్మోహనరెడ్డికి బుద్ధి ఎలా చెప్పారో ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న చంద్రబాబుకు కూడా అలానే బుద్ధి చెబుతారన్నారు. బాపట్ల మెడికల్ కళాశాల ఏవిధంగా అభివృద్ధి చేయకుండా దానిని అనాధలాగా వదిలేయటం దుర్మార్గమన్నారు. అదేవిధంగా డీఎం పల్లి వద్ద కల్యాణ మండపం ఏవిధంగా అభివృద్ధి చేయటంలేదన్నారు. బాపట్ల టూరిజం అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అన్ని ప్రభుత్వాల మీద ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, జోగి సురేష్, దోనేపూడి రవిబాబు, శీలం సాగర్, మాజీ కౌన్సిలర్ బక్కా రోశయ్య, చింతా బాబురావు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి గంటా అంజిబాబు

పింగళి 150వ జయంతోత్సవాలు

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ జెండాకు రూపకల్పన చేసి తెలుగువారి కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటిన వ్యక్తి పింగళి వెంకయ్య అని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. ఈసందర్భంగా పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగువారికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవ, ప్రతిష్ఠలను తీసుకొచ్చిన పింగళి చిరస్మరణీయులు అన్నారు. జాతి అస్థిత్వానికి, మనుగడకు మూలమైన త్రివర్ణపతకాన్ని ఆయన మనకు అందించారన్నారు. పింగళి వెంకయ్య 149వ జయంతి సందర్భంగా ఫోరంబెటర్ బాపట్ల ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవీవీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, మహాలక్ష్మి, మాజీ కౌన్సిలర్ శివనాగేశ్వరరావు, యశ్వంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు

విద్యార్థులు శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలి

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని బాపట్ల పట్టణ పోలీసులు అన్నారు. పట్టణ సీఐ రాంబాబు ఆదేశాల మేరకు బాపట్ల శ్రీచైతన్య కళాశాలలో శనివారం శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని బాపట్ల పట్టణ పోలీసులు నిర్వహించారు. అదేవిధంగా గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ అనే అంశంపై అవగాహన కల్పించారు.



రైతులకు డ్రోన్‌లను అందజేస్తున్న వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- రైతులకు రాయితీపై ఉపకరణాలు అందిస్తున్నాం
- ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా శనివారం అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల 85 వేల 838 మంది రైతుల ఖాతాల్లో నగదు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జమ చేశారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రైతులను విస్మరించిందని, టీడీపీ హయాంలో రైతుల కోసం ప్రవేశ పెట్టిన రాయితీ పథకాలన్ని రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను అహర్నిశలు కష్టపడి తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని పురోగతి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చారన్నారు. జగన్ హయాంలో కుంటుపడిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ పరుగులు పెట్టిస్తున్నారని, మళ్లీ రాజధాని అమరావతిలో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ ద్వారా ఏటా రైతు కుటుంబానికి రూ.20 వేలు సాయం అందేలా కూటమి ప్రభుత్వం హామీ నెరవేర్చామన్నారు. కౌలు రైతులు కూడా రెండు విడతల్లో పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 27965 మంది రైతులకు సంబంధించి రూ.18.95 కోట్లు అన్నదాత సుఖీభవ నగదు ఎమ్మెల్యే విడుదల చేశారు. రాయితీపై దోనేపూడికి చెందిన వెనిగళ్ల మహేష్ డ్రోన్ పరికరాన్ని అందజేశారు. రైతులకు విత్తనాల కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి దేవరాజు, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, డీసీ చైర్మన్ యలవర్తి కోటేశ్వరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ జీఎల్‌జి భగవాన్, పీఏసీఎస్ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు అండగా తెలుగుదేశం ప్రభుత్వం : వేగేశన

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా 20 వేల రూపాయలు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల మార్కెట్ యార్డులో శనివారం అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ తొలివిడత కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలలో భాగంగా అన్నదాతసుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతగా కేంద్రం ఇచ్చిన రూ.2 వేలతోపాటు రాష్ట్రప్రభుత్వం రూ.5 వేలు జత చేసి మొత్తం రూ.7 వేలను రైతుల ఖాతాలలో వేయటం జరిగిందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో 18,385 మంది రైతులకు 12.39 కోట్ల రూపాయలు ఈ పథకం కింద అందిస్తున్నామని తెలిపారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద 12,500 ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం కేవలం రూ.7,500 మాత్రమే ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు రోడెక్కి ఉద్యమాలు చేయాల్సి వచ్చిందన్నారు. కాని కూటమి ప్రభుత్వం 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెలిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,674 కోట్లను కూడా చెల్లించటం జరిగిందన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారికి రూ.3,826 కోట్ల రుణాలను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మామిడి, బర్లీ పొగాకు, కోకో, కొబ్బరి, పొగాకు, మిర్చి, టమోట ఉత్పత్తుల ధరలు పడిపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతులు నష్టపోకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతాజయప్రకాష్ నారాయణ, బాపట్ల పట్టణ, మండల అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల అధ్యక్షుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఏపూరి భూపతిరావు, ఈస్ట్ బాపట్ల, జమ్ములపాలెం సొసైటీ చైర్మన్‌లు తాతా హరిశ్చంద్ర ప్రసాద్, చెన్నుపాటి కిషోర్‌బాబు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ దివ్యాంగుల జన సైనికుడు గోగన ఆదిశేషు

దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి జనసేనకి ప్రకటించాలి

- దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని జనసేన పార్టీకి ప్రకటించాలని బాపట్ల జనసేన పార్టీ దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హాలులో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జనసేన పార్టీలో దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీవార్డు మెంబర్ నుంచి పార్లమెంట్ వరకు దివ్యాంగులకు 5 శాతం రాజకీయ రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. చదువుకున్న దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు, వ్యాపారం చేసుకుంటున్న ప్రతి దివ్యాంగుడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలిచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని తెలిపారు. ఈ అంశాలను జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కోకి రాజశేఖర్‌రెడ్డి, అనీల్‌కుమారి, శ్రీనివాసరెడ్డి, శీలం శ్రీనివాసరావు, రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల మనసులో నిలిచిన బళ్ళారి రాఘవ

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : భాష ఏదైనా, పాత్ర ఏదైనా కేవలం తమ హావభావాలతోనే ప్రేక్షకుల మన్ననలను పొందిన నటులు అతి తక్కువ కాలంలోనే ప్రేక్షకుల మెప్పు పొంది నేటికి ప్రజల మనసులలో నిలిచిపోయిన మహానటుడు బళ్ళారి రాఘవ అని ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.వినోద్ అన్నారు. బాపట్ల ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో శనివారం బళ్ళారి రాఘవ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అప్పటికప్పుడు అలవోకగా డైలాగ్‌లు చెప్పి ప్రేక్షకులను మైమరపింప చేసే సహజ నటుడు బళ్ళారి రాఘవ అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్లెస్సీసాగర్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, కె.సౌజన్య, డాక్టర్ ఇ.గౌతమి, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బళ్ళారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ వినోద్, ప్రొఫెసర్లు తదితరులు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు అందజేశారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామానికి చెందిన నలుగురు అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొంది విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించి ఆర్థిక సాయం అర్థించగా స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో రాగా శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆనందబాబు అందజేశారు. పట్టెం విజయలక్ష్మికి రూ.75 వేలు, చందలూరి శివపార్వతి రూ.20,524, బండారు వెంకటశేషాద్రికి రూ.15 వేలు, జి.మల్లిఖార్జునరావుకు రూ.13,500 మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆ మొత్తాన్ని అందుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పారిశుధ్యాన్ని తొలిగించిన కార్మికులు

బాపట్లరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణ శివారులోని మూర్తిరక్షణ్‌నగర్ సమీపంలో గుంటూరు రోడ్డు పక్కన ఉన్న పారిశుధ్యాన్ని కార్మికులు శనివారం తొలిగించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పారిశుధ్యాన్ని మండలానికి చెందిన కార్మికులు వచ్చి తొలిగిస్తున్నారు. ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ చేయాలంటే వెదుళ్ళపల్లి పంచాయతీకి చెందిన ట్రాక్టర్ పారిశుధ్య సిబ్బంది సేవలు వినియోగించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా పంచాయతీ అధికారి సదరు విషయమై మున్సిపల్ వారితో చర్చించి హద్దులు నిర్ణయించి బాపట్ల మండలంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచే నిమిత్తం ఆటోలు, ట్రాక్టర్‌లు మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపాలని డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

బాపట్ల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల భాష్యం పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంటూరు జోనల్ అధికారి హృదయరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల చిన్నపిల్లలకు స్నేహం, సామాజిక నైపుణ్యాల ప్రాముఖ్యతను నేర్పించటానికి దోహదపడతాయన్నారు. అదేవిధంగా తోటి విద్యార్థుల పట్ల సానుభూతి, దయ, సహాయ సహకారాల వంటి భావాలను అర్థం చేసుకోవటానికి ఇది వారికి సహాయపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి కోసం రైతుల ఇక్కట్లు

- అధికారుల సమన్వయ లోపంతో అన్నదాతలకు అందని నీరు

అమృతలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జలాశయాల నిండా పుష్కలంగా నీరు ఉన్నా సాగు నీటి కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు. కృష్ణా పశ్చిమ డెల్టా పశ్చిమ తూర్పు, పడమర కాల్వల ద్వారా మండల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. తూర్పు ప్రధాన కాల్వలో తురుమెళ్ళ వద్ద 90 రీడింగ్ ఉంటేనే డైరక్ట్ తూములకు నీరు ప్రవహించదు. కాని ఇక్కడ రీడింగ్‌ను మెయిన్‌టెన్ చేయడంలో అధికారులు విఫలం అవడంతో రైతుల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తుంది. తూర్పు ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం శనివారం ఉదయం తగ్గడంతో రైతులు ఆగ్రహం వ్యక్తపరిచారు. నాట్లు ముమ్మరంగా సాగుతున్న సమయంలో ఇలా చేయడంపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. తూర్పు ప్రధాన కాల్వల పరిధిలోని సాగునీటి అధ్యక్షుల మధ్య సమన్వయ లోపం కూడా ఉందని రైతులు తెలుపుతున్నారు. ఈ కాల్వలో తూటి కాడను తొలుత దిగువన తొలగించి అనంతరం ఎగువ తొలగించడంతో తూటికాడ మొత్తం దిగువకు నీటి ప్రవాహంలో కొట్టుకు రావడంతో సమస్య యధాతంగా మారింది. దీంతో కొంత మంది రైతులు కాల్వలోని తూటి కాడను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. ఈ పనులు కూడా సక్రమంగా జరగలేదని అదేమంటే నిధులు ఎక్కడ ఉన్నాయని డిసిలు ప్రశ్నిస్తున్నారని రైతులు చెబుతున్నారు. పలు చోట్ల కాల్వలో చెట్లు అడ్డంగా ఉండి నీటి ప్రవాహంకు అడ్డంగా పడిఉన్నాయని రైతులు చెబుతున్నారు. కట్టలు కూడా సక్రమంగా సరిచేయలేదని తూతూ మంత్రంగా చేశారని రైతులు పేర్కొంటున్నారు. కాల్వలో ఎగువ ప్రాంతంలో నీరు అధికమై గట్టులు పొర్లేలా ఉంటే దిగువ ప్రాంతంలో నీరు అందని పరిస్థితి నెలకుంది. అధికారులు స్పందించి రైతులకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.



నిజాంపట్నం కాల్వ గట్టు పొర్లి తూర్పు కాల్వలోకి వస్తున్న నీరు



తూర్పు కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న చెట్టు

13న జాతీయ లోక్‌అదాలత్

రేపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన కేసులు పరిష్కరించేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్యసాయి శ్రీవాణి అన్నారు. కోర్టు ప్రాంగణం సర్కిల్‌లోని పోలీస్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరిధిలో ఉన్న కేసులు పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈనెల 13వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతాభార్గవి, రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ.వెంకటగిరిధర్, సెక్రటరీ య్యా.శ్రీనివాసరావు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్‌సివిల్‌జడ్జి వి.దివ్యసాయిశ్రీవాణి

ఖాళీ స్థలాల్లోని పిచ్చిమొక్కలను తొలగించుకోవాలి



ఖాళీస్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్‌సిబ్బంది

రేపల్లె, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను యజమానులు తొలగించుకోవాలని కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ఖాళీస్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను శనివారం తొలగించారు. ఆయన మాట్లాడుతూ ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి దోమల బెడద, విషసర్పాలు తిరుగుతున్నాయని ఆయా వార్డు ప్రజలు తెలపటంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా ఖాళీస్థల యజమానులకు మొక్కలను తొలగించాలంటూ నోటీసులు జారీ చేస్తున్నామని, ఆయా స్థలాల్లో బోర్డులు పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అమలుపై చేనేతల హర్షం

చెరుకుపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చేనేతలకు ఈనెల నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిన సందర్భంగా మండలంలోని కనగాలలో చేనేత కార్మికులు చంద్రబాబు నాయుడు, లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచుమర్తి వీరరాఘవయ్య, జొన్నాదుల పూర్ణచంద్రరావు, గుర్రం సుబ్బారావు, మాచర్ల శ్రీనివాసరావు, మండూరు శ్రీనివాస్, మాచర్ల భానుకుమార్, అవ్వారు కుమార్ పాల్గొన్నారు.



చంద్రబాబు, అనగాని చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

ఎంఆర్‌పీకే మద్యం విక్రయించాలి



మద్యం షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

చెరుకుపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు ఎంఆర్‌పీ ధరలకే మద్యం విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మార్బూరి శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మండలంలోని వివిధ షాపులలో తనిఖీలు నిర్వహించి ఎలాంటి ఎంఆర్‌పి ఉల్లంఘనలు జరగడం లేదని నిర్ధారించుకుని ఆషాపులలో మద్యం బాటిల్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై కంట్రోల్ రూమ్ నెంబర్14405కి గాని, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నెంబర్ 9490455599కిగాని సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారి ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

- సూపర్‌వైజర్ అమృతవాణి

వేమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల ద్వారా పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా శనివారం చావలి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ తల్లి పాల గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.పద్మావతి, వై.పద్మజ, పి.పద్మావతి, ఎస్.ఆదిశేషమ్మ, బి.రాజ్యలక్ష్మి, పి.శైలజ, లక్ష్మీనాంచారమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అమృతవాణి

గూడవల్లి గ్రామంలో...

చెరుకుపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం గూడవల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు పల్లపట్ల సీడీపీవో ఎం.అనసూయ సందర్శించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిడ్డలకు మొదటి టీకా తల్లిపాలేనని చెప్పారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన బిడ్డకే కాక తల్లికి కూడా ఉపయోగాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గూడవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.గౌరీ, అనుపమ, లక్ష్మీకల్యాణి, హసీనా, అక్రమ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం బాలభారతీ విద్యావిహార్ స్కూల్‌లో కిశోరీ వికాస్ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ యమగీరివాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది.

బంగారురెడ్డిపాలెంలో...



పౌష్టికాహారం అందజేస్తున్న సీడీపీవో లక్ష్మీ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి

కర్లపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ పి.రామకృష్ణ అన్నారు. కర్లపాలెం పంచాయతీ బంగారురెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కర్లపాలెం ఐసీడీఎస్ సెక్టార్ ఆధ్వర్యంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పౌష్టికాహారం, కూరగాయలను ప్రదర్శించారు. సీడీపీవో లక్ష్మీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, సర్పంచ్ ఎన్.లలితకుమారి గర్భవతులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ శివపార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల కోసం పోరాటం చేస్తే అక్రమ అరెస్టులా?

- మాజీ మంత్రి పేర్ని నాని

రేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యల కోసం పోరాటం చేస్తుంటే పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేసి దాడి చేయటం ఏమిటని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో వేమూరు వైసీపీ ఇన్‌చార్జ్ అశోక్‌బాబును మాజీ మంత్రి పేర్ని నాని, మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్, కోన రఘుపతి, సుధాకర్‌బాబు పరామర్శించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటుతున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

10న రాంబొట్లపాలెంలో ఉచిత వైద్యశిబిరం

చెరుకుపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంబొట్లపాలెం గ్రామంలో ఈనెల 10న వాసిరెడ్డి సుబ్బారావు హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించబడుతుందని డాక్టర్ వాసిరెడ్డి విశ్వక్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరంలో అన్నిరకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షించబడునని చెప్పారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి రాయితీ ఇస్తామన్నారు.



గవర్నర్ అబ్దుల్‌నజీర్ నుంచి గౌరవ డాక్టరేట్స్ అందుకుంటున్న ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు, ఇండియన్ ప్లేబాక్ సింగర్ కంపోజర్ డాక్టర్ కొమండూరి రామాచారి తదితరులు

సాంకేతిక నగరంగా అమరావతి

● క్వాంటం టెక్నాలజీకి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ ● విజ్ఞాన్స్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

గుంటూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పరిపాలనా నగరంగానే కాకుండా, సాంకేతిక నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శనివారం 13వ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ స్మార్ట్ శ్రేణి మౌలిక వసతులు, సుస్థిరత, డిజిటల్ పాలనా కేంద్రంగా అమరావతి మారుతోందన్నారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రపంచ క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా మారాలన్న దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. అత్యాధునికంగా అమరావతి నిర్మాణానికి విద్యార్థులు, యువతే మూలస్తంభాలన్నారు. ఇంజనీరింగ్ వల్ల వ్యవసాయ రంగానికి డ్రోన్లు, సెన్సార్లు, డేటా ఆధారిత ఫార్మింగ్ సాధ్యమైందన్నారు. ఆరోగ్యరంగంలో డయాగ్నొస్టిక్స్ డ్రగ్ డెలివరీలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. పాలసీ, విద్య, మానసిక శాస్త్రంలో డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా స్థిరమైన పరిష్కారాలు సాధ్యమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఏఐ టూల్స్‌పై పట్టు సాధించాలన్నారు. విద్య, ఉద్యోగం, ఆట, పాటల్లో టాపర్లగా నిలవాలన్నా మంచి అలవాట్లు, చక్కని ప్రణాళిక ఎంతో కీలకమన్నారు. జెన్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అట్లూరి ప్రసంగిస్తూ సాంకేతిక పురోగతి నుంచి సామాజిక అసమానత వంటి అనేక గణనీయమైన సవాళ్లను ప్రపంచం ఎదుర్కొంటోందని, దీనిని పరిష్కరించడం యువకుల బాధ్యత అన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం సయోధ్యకంటే సంఘర్షణ, సామరస్యత కన్నా విభేదాలు, శాంతి కన్నా కలహాలు కనిపిస్తున్నాయన్నారు. పరిస్థితుల మధ్య మళ్లీ ఒక గాంధీ, ఒక బుద్ధుడు పుడితే ఎంత మంచిదో అనిపిస్తోందన్నారు. మానవత్వాన్ని గుర్తు చేస్తూ, శాంతిని వ్యాప్తిచేస్తూ, మానవాళిని మళ్లీ సద్గతికి నడిపించగల నేతలు కావాలన్నారు. వేదాలు కూడా ఓం శాంతిః శాంతిః శాంతిః అంటూ ప్రారంభమవుతాయని, శాంతే మన అభివృద్ధికి మూలస్తంభమన్నారు. విజ్ఞాన్స్ వైస్ చైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మేకిన్ ఇండియా మాత్రమే కాదు ఇన్వెంట్ ఇన్ ఇండియా, డిజైన్ ఇన్ ఇండియా, లీడ్ ఫ్రమ్ ఇండియా కూడా కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, సీఈవో డాక్టర్ కూరపాటి మేఘన, బోర్డుఆఫ్ మేనేజింగ్ సభ్యులు, విభాగాల డీన్లు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సంబరం

డిగ్రీలు అందుకున్న విద్యార్థుల ఆనందోత్సాహాలతో స్నాతకోత్సవ సంబరం అంటరాన్ని అంటింది. విద్యార్థుల కేరింతలతో వర్సిటీ ప్రాంగణం హోరెత్తింది. విద్యార్థులంతా తలపాగా, కండువాలతో అచ్చతెలుగు సంప్రదాయ దుస్తులతో వేడుకలో పాల్గొనడం ఆహూతులను ఆకట్టుకుంది. ఐల్యాబ్స్ గ్రూప్ ఫౌండర్ చింతలపాటి శ్రీనివాసరాజు, జెన్ టెక్నాలజీస్ ఎండీ అశోక్ అట్లూరి, మ్యూజిక్ గురు డాక్టర్ కొమండూరి రామాచారిలకు గవర్నర్ గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. 2122 మంది డిగ్రీలు, 60 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు.

స్నేహం....రెండక్షరాల ఓ చిన్న పదం.. కానీ, ప్రభావం మాత్రం అనంతం. మానవ జీవన గమనంలో ప్రతి దశలోనూ తోడుండి నడిపించే ఇంధనం. మతం, భాష, ప్రాంతీయ భేదాలు లేని మనిషి మూలధనం. తల్లిదండ్రుల తర్వాత వ్యక్తి జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే గొప్ప బంధం. ఓ వ్యక్తి జీవితం సరైన దిశలో సాగినా లేదా అస్తవ్యస్తంగా మారినా దాని వెనక తప్పని సరిగా ఓ స్నేహితుడు ఉంటాడు. మంచైనా చెడైనా మన భవిష్యత్తును ప్రభావితం చేసేది మాత్రం ఈ స్నేహ బంధమే. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మారుతున్న స్నేహాలపై ప్రత్యేక కథనం..



శాశ్వతం.. స్నేహితం

నేడు స్నేహితుల దినోత్సవం

❖ కొత్త మార్గాల్లో స్నేహ హస్తాలు..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

దశాబ్దం క్రితం వరకు ఒక్కొక్కరి స్నేహితుల జాబితా చాలా పెద్దదిగానే ఉండేది. ప్రస్తుతం స్నేహితులెంతమంది ఉన్నారనే ప్రశ్నకు నేటి యువత ఇస్తున్న సమాధానం ఇద్దరి, ముగ్గురి లోపే. అది కూడా ఎక్కువగా కళాశాల స్నేహాలే ఉంటున్నాయి. స్నేహతత్వం మారకపోయినా మనుషుల ఆలోచనల్లో మాత్రం కొంత మార్పు కనబడుతోంది.

బాల్య స్నేహితులేరి..

వృద్ధాప్యంలో బాల్య స్నేహితులను కలిసి నప్పుడు కలిగే మానసిక ఉల్లాసమే వేరు. గడచిన రెండు తరాలుగా ఇలాంటి స్నేహా లు కనిపించడం లేదు. కళాశాల రోజులకు వచ్చేసరికి స్కూల్ ఫ్రెండ్స్ దూరమవు తున్నారు. ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టేసరికి కళాశాల స్నేహితులు కనిపించడం లేదు. తీరా సంసార జీవితంలోకి అడుగు పెట్టేసరికి అసలు స్నేహితులే లేకుండా పోతున్నారు.



ఓదార్చే చేయి లేక.. 50 శాతం ఆత్మహత్యలు

ఇటీవల చిన్నచిన్న విషయాలకే కుంగుబాటుకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వీరిలో అధిక శాతం యువతే ఉండడం మరింత కలవరపరుస్తోంది. ఓ సంస్థ జరిపిన అధ్యయనంలో ఆత్మహత్య ఆలోచన వచ్చినప్పుడు సరైన స్నేహితుడు పక్కన ఉంటే దాని నుంచి బయటపడడం తేలిక అని తేల్చింది. బలవంతంగా ఉసురు తీసుకుంటున్న వారిలో 50 శాతం మరణాలు సాధకబాధకాలు చెప్పుకునే స్నేహబంధం లేకపోవడం వల్లేనని సర్వేలో తేలింది.

స్నేహం..ప్రేమై.. మళ్లీ స్నేహితులుగా..

యువతీయువకుల మధ్య స్నేహబంధాలు ప్రేమగా కూడా చిగురించడం సాధా రణమే. పలు కారణాల వల్ల బంధం విచ్ఛిన్నమైతే.. మంచి స్నేహితులుగా అడుగులేసే ఆరోగ్యకర పరిణామం ఇటీవల కాలంలో కనబడుతోంది. ఇది మైత్రీ బంధం విలువను మరింత పెంచుతోంది.

❖ తగ్గిన స్నేహితుల సంఖ్య

ఆన్‌లైన్ స్నేహాలు..

ఆన్‌లైన్ స్నేహాలూ ఈ దశాబ్దంలో కొత్తగా పురుడుపోసుకున్నవే. నిజానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్నేహం ఏదైనా కావొచ్చు దాని విలువ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. కానీ, ముక్కూ మొఖం తెలియని వ్యక్తులకు స్నేహం ఎరవేసి తర్వాత ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న ఉదంతాలు ఇటీవల కోకొల్ల లుగా వెలుగుచూ స్తున్నాయి. ఇవన్నీ కూడా స్నేహ బంధానికి బీటలు వారేలాగా చేస్తున్నాయి.

యాప్ స్నేహితులు..

స్నేహితులను యాప్‌లలోనే వెతుక్కోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఏర్పడింది. యువత సమయం సగం సెల్ ఫోన్‌కే సరిపోతోంది. ఇలాంటి వారే టార్గెట్‌గా మిత్రులను సంపాదించుకోండనే ప్రకటనలు.. వస్తున్నాయి. స్నేహం వ్యాపార వస్తువుగా చూసే పయత్నాలు జరుగుతున్నాయి.

ఎమోషనల్‌గా, మోరల్‌గా..

మేం ఇద్దరం బీటెక్ ఫస్ట్ ఇయర్‌లోనే స్నేహితులయ్యాం. ఫైనల్ ఇయర్‌కు వచ్చేసరికి మా మధ్య ఎమోషనల్ బాండింగ్ ఏర్పడింది. ఏ విషయమైనా చర్చించుకుంటాం. భవిష్యత్తులో ఏవైనా హర్డిల్స్ ఎదురైనా ఈ బంధం దన్నుగా ఉంటుందనే నమ్మకం మాకుంది. పెద్దగా స్నేహం నిర్వచనాల గురించి మాకు తెలియదు. ఏదయినా విషయంలో బాధ కలిగినప్పుడు తనతో చెప్పుకుంటే కాస్త రిలీఫ్‌గా ఉంటుంది. మళ్లీ నార్మల్ అవుతాం.

-ఎన్. హిమబిందు, డేటా సైన్స్ ఫైనల్ ఇయర్, బాపట్ల
-కె.లక్ష్మీ చేతన, బీటెక్ ఫైనల్ ఇయర్



మాటిచ్చాం.. అమలు చేశాం

అన్నదాత సుఖీభవ ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి

వినుకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాలు అలంకారప్రాయం కాకూడదని, రైతులకు అధికారులు ఎప్పటిక ప్పుడు సమాచారం ఇస్తూ సేవలు అందించాలని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. స్థాని క మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో కలిసి ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రధాని నరేంద్రమోదీ, ప్రకాశం జిల్లా దర్శిలో అన్నదాత సుఖీ భవ కార్యక్రమం ప్రారంభ ఉపన్యాసాన్ని రైతులకు వినిపించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ 46,87,530 మంది రైతుల ఖాతాల్లో రూ.32వేల కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. రైతుకు ఇచ్చిన మాట ప్రకా రం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకా రంతో విద్యుత్ తయారు చేసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల కనెక్షన్లను సోలార్ సిస్టం ద్వారా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. సోలార్ యూనిట్ ఏర్పాటుకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నా యని, ప్రతి నియోజకవర్గంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి సబ్ స్టేషన్‌లకు విద్యుత్ అందించడం ద్వారా 9 గంటల యూనిట్‌ను అందజేస్తామన్నారు.



రైతులకు డ్రోన్ పరికరాలను అందజేస్తున్న కూటమి నాయకులు మంత్రి గొట్టిపాటి రవి, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తదితరులు

ప్రజల సొమ్ము దోచుకున్న వారికి శిక్ష తప్పదు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 23 మంది ఎమ్మెల్యేలు ఉన్నా. అసెంబ్లీకి వెళ్లి.. ప్రజల తరపున వారి సమస్యలను వినిపించామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. నేడు జగన్ మోహన్‌రెడ్డి అరాచకాలను ప్రజలు గుర్తించి 11 సీట్లకు పరిమితం చేశా రన్నారు. ప్రజా సమస్య లను దేవాలయం లాంటి అసెంబ్లీలో ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకున్నవారికి శిక్ష తప్పదని, ఆధారలతో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

సీసీఆర్ ఉంటే.. రెండవ విడత జమ

సీసీఆర్ కార్డు ఉంటే 2వ విడత కూడా రైతులకు నగదు జమ అవుతుందని, ఎవరూ అపోహ చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సాగర్ నీరు వచ్చిందని, రైతులు సాగుకు సిద్ధంగా ఉండాలని రైతులకు సూచించారు. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్ఎస్‌కేల్లో ఉంచినట్లు చెప్పారు. పొగాకు పంటలను సాగు చేయొద్దని సూచించారు.

రైతులకు మద్దతుగా నిలిచాం..

సీఎం చంద్రబాబునాయుడు రూ.270 కోట్లతో పొగాకు కొనుగోలు చేశారని, కోకో, మ్యాంగో పంటలకు కూడా ప్రత్యేక నిధిని కేటాయించి వారికి మద్దతుగా నిలిచామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ నెల 11న వినుకొండలో హార్టికల్చర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజవరపు అచ్చెన్నాయుడు, మంత్రి గొట్టిపాటి రవి హాజరవుతారని చెప్పారు. జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, డీఈవో జగ్గారావు, ఏడీఏ హనుమంతరావు, ఏవో కోటయ్య, ఏడీఏ రవికుమార్, ఏవో వరలక్ష్మి, డీహెచ్‌వో ఐ.వెంకట్రావు, వినుకొండ హెచ్‌వో రసూల్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోరే..

కూటమి ప్రభుత్వం

● 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ● మంత్రులు కొలుసు, అనగాని

రేపల్లె, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అన్నదాతతోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మిన పార్టీ టీడీపీ అని, అందుకే ఆ పార్టీ జెండాలోనే నాగలి గుర్తు ఉంటుందని జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. శనివారం రేపల్లె మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని మంత్రులు అనగాని, కొలుసు పార్థసారధి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటమురళి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని, ఇప్పటికే ఈ పథకం కోసం 2342 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఎవరికైన సందేహం ఉంటే 155251 కాల్ సెంటర్ నంబరుకు ఫోన్‌చేసి పరిష్కరించుకోవచ్చన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, అలాగే యంత్ర పరికరాలు, రైతురథాలను రాయితీపై ఇచ్చామని చెప్పారు. గతప్రభుత్వం వీటన్నింటిని రద్దుచేసిందని రైతులను నట్టేటముంచిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడిసహాయం కింద రూ.12,500లు ఇస్తామని చెప్పిన గత ప్రభుత్వం కేవలం రూ.7,500లు మాత్రమే ఇచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు రోడ్డెక్కి ఉద్యమాలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూటమిప్రభుత్వం 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించి రైతులకు అండగా నిలిచిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,674కోట్లను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే 18 ఏళ్ల తర్వాత మొదటిసారి ప్రాజెక్టులన్నీ జూలై నాటికే నిండిపోయాయని తెలిపారు. కౌలురైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.3,826 కోట్లను మంజూరుచేశామన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 28 వేల మంది రైతులకు రూ.15 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తున్నామన్నారు. బాపట్ల ఎంపి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నట్టేట ముంచారని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ రైతులకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ పథకం సద్వినియోగపడుతుందన్నారు. అనంతరం రైతులకు అన్నదాతసుఖీభవ-పీఎంకిసాన్ పథకం చెక్కును మంత్రులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆర్డీఓ రామలక్ష్మీ, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైరన్ పంతాని మురళీధరరావు, రాష్ట్రకార్యదర్శి గూడపాటిశ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

పల్నాడులో పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు

హెచ్‌ఆర్ఎఫ్, ఆర్ఎస్‌వీ నిజనిర్ధారణ

నరసరావుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో దశాబ్ద కాలంలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక వెల్లడించింది. జిల్లాలో రైతులు ఆత్మహత్యలపై సదరు సంస్థలు నిజనిర్ధారణ చేశాయి. బాధిత రైతు కుటుంబాలను కలసి ఆత్మహత్యలకు కారణాలను తెలుసుకున్నాయి. ప్రభుత్వం ఇప్పటి కైనా నిద్రలేచి జీఓ నంబరు 43ని అమలు పరచి, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలని హెచ్‌ఆర్ఎఫ్.. ఆర్ఎస్‌వీ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. పాల కుల నిర్లక్ష్యం, ప్రకృతి చిన్నచూపు వల్ల కౌలు రైతులకు జరుగు తున్న తీవ్ర అన్యాయం కారణంగానే పల్నాడు జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని తమ నిజనిర్ధారణలో నిరూపణ అయ్యిందని పేర్కొన్నాయి. చనిపోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని పేర్కొన్నాయి. జూలై 29, 30 తేదీల్లో పల్నాడు జిల్లా గురజాల డివిజన్‌లోని వెల్దుర్తి, దుర్గి, గురజాల మండలాల్లోని 8 గ్రామాలలో ఆత్మహత్య చేసుకున్న 9 మంది రైతు కుటుంబాలను, గ్రామస్థులను కలిసి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలు, ప్రభుత్వ స్పందన గురించి విషయసేకరణ చేశామని సభ్యులు తెలిపారు. పల్నాడు ప్రాంతంలో మిగిలిన డెల్టా ప్రాంతాల కంటే కౌలు రైతులు తక్కువగా ఉండేవారు కానీ, గత కొన్ని సంవత్సరాలుగా పల్నాడులో కౌలు రైతుల సంఖ్య పెరిగిందని తెలిపారు. కౌలు రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని, దాదాపు రూ.25 వేల కౌలు చెల్లించి పత్తి, మిరప, వరి, కందులు సాగు చేసిన రైతులు కొన్ని సార్లు అధిక వర్షాలు, కొన్ని సార్లు అనావృష్టి, చీడ పీడల కారణాలతో తీవ్ర నష్టాలతో అప్పుల వారి వత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. వెల్దుర్తి మండలంలో వెయ్యి అడుగులు దాటితే గాని బోరు నీళ్లు పడడం లేదని, బోర్ల కోసం కొంతమంది రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్నప్పటికీ.. విఫలం అవుతున్నారని చెప్పారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబంతో మాట్లాడుతున్న హెచ్‌ఆర్ఎఫ్.. ఆర్ఎస్‌వీ నిజనిర్ధారణ కమిటీ

ఆత్మహత్యలను దాచి పెడుతున్నారు

సమాచార హక్కు చట్టం ద్వారా, నేర పరిశోధన విభాగం వారి లెక్కల ప్రకారం పల్నాడు జిల్లాలో ఈ దశాబ్ద కాలంలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే వారు ఎంత సంక్షోభంలో ఉన్నారో అర్థమవుతోందని నిజనిర్ధారణ వేదికలు తేల్చాయి. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ఎప్పటికి రావచ్చని అధికారులను తమ బృందం ప్రశ్నిస్తే వారి దగ్గర కూడా ఎటువంటి సమాధానం లేదని వెల్లడించాయి. వాస్తవానికి రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి కనబడుతోందని చెప్పాయి. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 300 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు రైతు సంఘాలు, పోలీసుల లెక్కలు చెప్తుంటే ప్రభుత్వం కేవలం 39 మంది రైతులు మాత్రమే ఆత్మహత్య చేసుకున్నట్లు అసెంబ్లీలో చెప్పడం రైతు ఆత్మహత్యలను ఎంత దాచి పెడుతున్నారో అర్థం అవుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేశాయి.

గడపతొక్కని త్రిసభ్య కమిటీలు..

ఇక ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడం కోసం తెచ్చిన జీవో 43 అమలు తీరు దారుణంగా ఉందన్నారు. సందర్శించిన 9 బాధిత కుటుంబాల్లో ఒక్క కుటుంబానికి మాత్రమే ఆ జీవో కింద రూ.7లక్షల ఎక్స్ గ్రేసియా అందిందని చెప్పారు. కొన్ని చోట్ల బాధిత కుటుంబాలకు సంవత్సరం దాటినా.. ఎక్స్ గ్రేషియా అందలేదని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం దగ్గరికి కూడా డివిజన్ స్థాయి త్రిసభ్య కమిటీ (ఆర్డీవో, డీఎస్పీ, ఏడీఏ) స్వయంగా వెళ్ల లేదని వెల్లడించారు. కనీసం ప్రాథమిక నివేదిక సమర్పించవలసిన మండల స్థాయి త్రిసభ్య కమిటీ (తహసీల్దార్, వ్యవసాయ అధికారి, సబ్ ఇన్‌స్పెక్టర్) కూడా కుటుంబాల దగ్గరికి రాలేదని నిర్ఘాంతపోయే విషయాలను చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి లాంటి అధికారులు కనీసం కుటుంబ సభ్యులను కూడా కలవకుండా తూతూ మంత్రంగా విచారణ చేసి నివేదికలు పంపారని వివరించారు. ఆత్మహత్య జరిగిన రైతు కుటుంబాలలోని మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏ ఒక్క కుటుంబంలో మహిళకు వితంతు పెన్షన్ రావడం లేదన్నారు.

సమగ్ర అధ్యయనం చేయాలి..

ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రలేచి చితికిపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని వేదికలు డిమాండ్ చేశాయి. బాధిత కుటుంబాలను డివిజనల్ స్థాయి త్రిసభ్య ధ్రువీకరణ కమిటీ ఆలస్యం చేయకుండా సందర్శించి, విచారణ పూర్తి చేసి సత్వరమే పూర్తి స్థాయిలో కుటుంబాలకు ఆర్థిక సహాయం, పునరావాసం కల్పించాలని కోరాయి. అత్యధిక ఆత్మహత్యలు జరుగుతున్న రాయలసీమ, పల్నాడు, ప్రకాశం జిల్లాలలో సమగ్ర అధ్యయనం చేసి.. సమస్యలు ఉన్న రైతుల కోసం ప్రభుత్వం ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మందాడి, రచ్చమల్లపాడు, శ్రీరాంపురం తండా, ముట్లుకూరు, మాడుగుల, పులిపాడు, తేలకుట్ల గ్రామాల్లో పర్యటించిన వారిలో ఆర్ఎస్వీ రాష్ట్ర కన్వీనర్ టీ బాలు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ కొండలు, మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వై రాజేష్, కార్యవర్గ సభ్యులు కే అనురాధ, మానవ హక్కుల వేదిక సమన్వయకర్త వీఎస్‌కృష్ణ ఉన్నారు.

త్వరలో జీజీహెచ్‌లో

కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలు

● రూ.30 లక్షల విలువైన సర్జరీలు ఉచితంగా.. ● సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో త్వరలో కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. జాతీయ అవయవ దాన దినోత్సవం పురస్కరించుకొని శనివారం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు అవయవ దానంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి అధ్యక్షత వహించారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణకు ఇప్పటికే ఏపీ జీవన్ దాన్ ట్రస్ట్ నుంచి అనుమతులు లభించినట్లు డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. తొలి విడతలో కేవలం కేడావర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు మాత్రమే జరు గుతా యని ఆయన వివరించారు. బ్రెయిన్ డెడ్ అయిన రోగుల నుంచి సేకరించిన కాలేయాన్ని మా త్రమే ప్రస్తుతం రోగులకు మార్పిడి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం జీవించి ఉన్న వ్యక్తుల నుంచి సేకరించిన కాలేయ మార్పిడి ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామన్నారు. సుమారు రూ.30 లక్షల విలువైన కాలేయ మార్పిడి ఆపరేషన్లు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తామని, రోగులపై ఒక్క రూపాయి భారం కూడా ఉండ దని డాక్టర్ రమణ యశస్వి వెల్లడించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ లివర్ స్టడీస్, గ్లెనాగికల్ హాస్పిటల్ (చెన్నై)కు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ పచ్చ మాట్లాడుతూ గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్ల నిర్వహణకు తాము ఒప్పందం కుదుర్చు కున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ థియేటర్ల నిర్మాణం, వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోఆర్డినేటర్లకు కూడా ఏర్పాటు చేసినట్లు తెలి పారు. కాలేయ మార్పిడి అవసరమైన రోగులు తమ పేర్లను జీజీహెచ్‌లో నమోదు చేసుకుం టున్నట్లు డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. మరో రెండు నెలల్లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలను గుంటూరులో ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గ్యాస్ట్రోఎంటిరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ.కవిత, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సుందరాచారి, వేదికపై రమణ, రజనీకాంత్

అవీ..ఇవీ..

నాగుల చెరువును పరిశీలించిన అధికారులు



ఇంకొల్లులో చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఇంకొల్లు, ఆగస్టు 2, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నాగుల చెరువును శనివారం తహసీల్దార్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ పరిశీలించారు. గత 15 రోజులుగా చెరువులో చేపలు మృతి చెంది నీరు కలుషితమై దుర్వాసన రావడంతో పంచాయితీ అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు 100 బస్తాల గవ్వ సున్నం చల్లారు. ఈ నేపథ్యంలో అధికారులు చెరువును పరిశీలించారు. ఫిల్టర్ల బావులను పరిశీలించారు. పటిక సంచులను చెరువులో కలిసి నీటిని శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని పంచాయితీ అధికారి అడ్డగడ్డ వెంకటేశ్వర్లుకు సూచించారు. తహసీల్దారు శ్రీనివాసరావు అర్‌డబ్ల్యూఎస్ జేఈ జ్యోతితో మాట్లాడి ఫిల్టరు బావులు శుభ్రం చేయాలన్నారు. త్వరితగతిన నీటిని శుభ్రపరచి వాడుకునేందుకు ఉపయోగపడేలా గ్రామంలో సరఫరా చేయాలన్నారు.

5న నిరసన కార్యక్రమం

అద్దంకిటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదకర విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని ఈ నెల 5న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం అద్దంకి బస్టాండ్ కూడలిలోని వ్యాపార సంస్థల వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సాయిశ్రీ చరణ్

చినగంజాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సాయిశ్రీచరణ్ అన్నారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని కోడూరివారిపాలెంలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాయిశ్రీచరణ్ మాట్లాడుతూ.. ఇంటి పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే చినగంజాం పీహెచ్‌సీకి వచ్చి రక్త పరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.మురళి, 104 డీఈవో పొదిలి రాఘవ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



తల్లిపాలు ఇచ్చేగది ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీడీపీవో, అధికారులు

చినగంజాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు తల్లి పాలు సహజ టీకాల వంటివని ఇంకొలు ప్రాజెక్టు సీడీపీవో జి.సులోచనరాణి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రనావులు అన్నారు. 11వ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండల కార్యాలయాల సముదాయంలో తల్లి పాలు ఇచ్చే గదిని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కార్యాలయాలకు పనులు నిమిత్తం వచ్చే తల్లులు వారి చంటి బిడ్డలకు పాలు ఇవ్వడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అనుకూలమైన వాతవరం ఉండేలా గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఏపీవో గద్దె పెదసుబ్బారావు, చినగంజాం పీ.హెచ్.సీ వైద్యాధికారి సిరివెన్నెల, డీ.సీ.పీ.వో పి.పురుషోత్తం, ఎల్.సీ.పీ.వో పీ.మౌనిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎన్.సుమలత, కే.వాణిశ్రీ, కే.ఉషాకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



బాలికలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ అధికారి జయప్రద

పంగులూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎదిగే వయస్సులో బాలబాలికలలో కలిగే మార్పులు, పౌష్టికాహారం ప్రాధాన్యతలను ప్రతి విద్యార్థి గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. పంగులూరు ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు వేరువేరుగా ఏర్పాటు చేసిన కిశోర వికాసం కార్యక్రమాలలో పౌష్టికాహారం ప్రాధాన్యత, వ్యక్తిత్వంలో మార్పుల గురించి వివరించారు. విద్యార్థి దశలో చదువుపై దృష్టి సారించాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను తెలిపారు. అదేవిధంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. శ్రీనివాసరావు, కరీముల్లా, అంగన్‌వాడీ కార్యకర్తలు సుకన్య, సరోజిని, రజని, స్వర్ణలత, పీరాబి, ఏఎన్‌ఎం ఎస్తేరురాణి, ఆశా అంజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

చినగంజాం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చీరాల శక్తి టీం సభ్యులు, చినగంజాం పోలీసు సిబ్బంది శనివారం గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో చీరాల శక్తి టీం ఇన్‌చార్జ్ హరిబాబు, చినగంజాం ఎస్.ఐ శీలం రమేష్‌లు మాట్లాడుతూ శక్తియాప్ మహిళలకు రక్షణ కవచంలాంటిదన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాని ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై, సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్.ఐ సీ.హెచ్.అనూష, శక్తి టీం సభ్యులు, పోలీసు సిబ్బంది, పాఠశాల హెచ్.ఎం కుర్రా రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంపరాల మేజర్‌పై ఛిద్రమైన కాలువకట్ట, పగిలిపోయిన సిమెంట్ లైనింగ్, భారీ వాహనాలు తిరగడంతో కాలువలోనికి వచ్చిన కట్టమట్టి, కాలువలో పెరిగిన చిల్లచెట్లు

అస్తవ్యస్తంగా వెంపరాల మేజర్

అద్దంకి,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో వెంపరాల మేజర్ కాలువ కట్ట, సిమెంట్ లైనింగ్ ఛి ద్రమైంది. వెంపరాల కొండ నుండి విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం గ్రావెల్ ను వెంపరాల మేజర్ మీదుగా తరలిస్తున్నారు. దీంతో భారీ టిప్పర్ లు కాలువ కట్టల పై సుమారు రెండు నెలల పాటు ప్రయాణిస్తుండటంతో పలు చోట్ల సిమెంట్ లైనింగ్ దెబ్బతినటంతో పాటు కాలువ కట్ట కూడా పూర్తి గా దెబ్బతింది. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో కాలువ కట్ట ను ఒకింత పటిష్ఠం చేసుకొని గ్రావెల్ తరలించుకోవాల్సి ఉండగా ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకుండానే భారీ వాహనాలతో గ్రావెల్ తరలించారు. అప్పట్లోనే రైతులు అభ్యంతరాలు పెట్టినా గ్రావెల్ తరలింపు నిర్వహకులు పెడచెవిన పెట్టారు. ఎన్ఎస్‌పీ అధికారుల దృష్టి కి తీసుకుపోగా రైతులనే బెదిరించే విధంగా మాట్లాడటంతో మరింత విమర్శలకు తావిచ్చింది. అంతటితో ఆగకుండా సాగర్ నీరు విడుదల సమయానికి దెబ్బతిన్న లైనింగ్ తో పాటు కాలువ కట్ట కు పూర్తి స్థాయి లో మరమ్మతులు చేస్తామని చెప్పారు. శనివారం వెంపరాల మేజర్ కు నీటి విడుదల జరగగా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పలు చోట్ల నీటి ప్రవాహం కు అడ్డంకి గా ఉండటంతో పాటు సిమెంట్ లైనింగ్ దెబ్బతిని ఉండటంతో కోతకు గురయ్యే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని వెంపరాల మేజర్ కు సిమెంట్ లైనింగ్ మరమ్మతులు, కాలువ కట్ట పటిష్ఠం పనులు చేయించాలని రైతులు కోరతున్నారు.

వసతిగృహంలో బాలిక జుత్తు కత్తిరింపు

చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్లో దురాగతం

తోటివారే చేశారంటున్న బాధితురాలు

హాస్టల్లో సాంఘిక సంక్షేమశాఖ డీడీ విచారణ



బాలికలను విచారిస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్

చీమకుర్తి,ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చీమ కుర్తి ఎస్సీ బాలికల వసతిగృహంలో దురా గతం చోటుచేసుకుంది.శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్లో అందరితో కలిసి బాలిక నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియనివారు జుత్తు కత్తి రించారు.తెల్లారి నిద్రలేచి బయోమెట్రిక్ హాజరు వేసే నిమిత్తం వస్తున్న సమయంలో తన జుత్తు ఎవరో కత్తిరించారన్న విషయాన్ని బాధిత బాలిక గుర్తించింది.జుత్తును కత్తిరించి క్లిప్‌లు పెట్టిన వైనాన్ని వార్డెన్ అరుణ దృష్టికి బాలిక తీసుకెళ్లింది.దీనిపై వసతిగృహంలో వార్డెన్ విచారించగా సంఘటనకు పాల్పడిన వారు ఎవరో తేలలేదు.వెంటనే సంఘటన గురించి జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి వార్డె న్ తీసుకెళ్లారు.ఈలోపు ఈ సంఘటన మీడి యాలో గుప్పుమనటంతో రాజకీయరంగు పులుముకొంది. ఆ సమయంలో చీమకుర్తి లోనే ఉన్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున,వైసీపీ నాయకులతో కలిసి హాస్టల్‌ని సందర్శించి బాధిత బాలికను పరామర్శించి సంఘ టన గురించి తెలు సుకున్నారు.తన తోటి బాలికలే ఈప నికి పాల్పడి ఉంటా రని ఆ బాలిక నాయకులకు తెలి పింది.తదుపరి మీడి యాతో మాట్లాడిన నాగార్జున ప్రస్తుత మంత్రి,ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేయటం గమనార్హం.

డీడీ లక్ష్మానాయక్ విచారణ

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదేశాల మేరకు డీడీ లక్ష్మానాయక్ శనివారం వసతిగృహానికి విచ్చేసి సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపారు.బాధిత బాలికను పరామర్శించి ధైర్యం చెప్పారు.సహ బాలికలను సంఘట నపై అడిగి తెలుసుకున్నారు.తదుపరి జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన సంఘటన గురించి వివ రించారు.అర్ధరాత్రి అందరూ నిద్రించేవేళ బాలిక జుత్తును కత్తిరించారన్నారు.ఈ సంఘ టనలో బయటి వ్యక్తుల ప్రమేయంకు ఆస్కా రమే లేదని తన విచారణలో తేలిందన్నారు. రెండురోజుల క్రితం హాస్టల్లో ఉన్న బాలికల మధ్య పుస్తకాల విషయంలో జరిగిన చిన్న పాటి గొడవతో ఈ సంఘటన జరిగి ఉంటుం దేమో అని బాధిత బాలిక తన దృష్టికి తీసు కువచ్చిందన్నారు. వసతిగృహంలో బాలికల భద్రతకు ఎటువంటి డోకా లేదన్నారు.బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి వచ్చే పరిస్థితులులేవ న్నారు. అందరి బాలికల భద్రతకు తాము భరోసా ఇస్తున్నామన్నారు.

ఇది రైతుల ప్రభుత్వం



అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ రమేష్

సంతమాగులూరు ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూప ర్ సిక్స్‌లో భాగంగా మరొక పథకమైన అన్నదాత సుఖీభవ పథకాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు ప్రారంభించగా, శనివారం కొప్పురం రైతుసేవ కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. కార్యక్రమానికి సంతమాగులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్ పాల్గొన్నారు, సంతమాగులూరు మండలంలోని 22 గ్రామాల రైతులు 8871 కుటుంబాలు అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందనున్నారని కొప్పురం రైతుసేవా కేంద్రంలో 395 కుటుంబాలు లబ్ధి పొందారన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని, రైతులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. రైతులకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సైదా, పంచాయతీ కార్యదర్శి కె పున్నారావు, సుజాత, ఏహెచ్‌ఏ రామారావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ నగదు జమ

ఇంకొల్లు : ఇంకొల్లు మండలంలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద 6049 కుటుంబాలకు లబ్ధి చేకూరినట్లు ఏవో మేరమ్మ తెలిపారు. శనివారం వారి ఖాతాల్లో నగదు జమ పడడం ప్రారంభించినట్లు తెలిపారు. మండలం మొత్తంలో రూ.4.27కోట్ల లబ్ధిదారులకు అందనున్నట్లు ఆమె తెలిపారు.

కారు ఢీకొని ట్రాక్టర్ మెకానిక్ మృతి

అద్దంకి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీ కొనడంతో బైకుపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్ మెకానిక్ షేక్ అల్లాఉద్దీన్(45) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు బల్లికురవ మండలం వల్లాపల్లికి చెందిన షేక్ అల్లాఉద్దీన్ అద్దంకి పట్టణంలో సుదీర్ఘకాలం నుంచి ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అద్దంకిలో పని ముగించుకొని మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా కలవకూరు సమీపంలో వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అల్లాఉద్దీన్‌ను స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

5న ఉచిత వైద్యపరీక్షలు

ఇంకొల్లు, ఆగస్టు 2,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఈ నెల 5న పర్చూరులోని వైఆర్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరంలో ఉత్తరప్రదేశ్‌కు సంబంధించిన వైద్యబృందం పాల్గొని ప్రత్యేక అవసరాలు గల 18 సంవత్సరాల లోపు పిల్లలకు పిల్లలకు ఉపకరణాల నిమిత్తం ఉచిత పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9741090759 నంబరును సంప్రదించాలన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసానితో ఎమ్మెల్యే ఏలూరి భేటీ



మంత్రి పెమ్మసానితో ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రితో ఆయన చర్చించారు. ప్రధానంగా గుంటూరు నుంచి ఎన్‌జీపాడు వయా పర్చూరు - ఇంకొల్లు ఓల్డ్ మద్రాస్ రోడ్డు 83 కిలోమీటర్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే ఈ రహదారి అభివృద్ధి కోసం కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి లేఖ రాశానని ఆయన దీనిపై సానుకూలంగా స్పందించనట్లు తెలిపారు. త్వరిత గతిన రోడ్డు అభివృద్ధికి ప్రత్యేక దుష్టి చూపాలని కోరామన్నారు. అదేవిధంగా పర్చూరు వరకు గుంటూరు ఛానల్‌లను పొడిగించే పనులు చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించినట్లు తెలిపారు. త్వరిత గతిన గుంటూరు ఛానల్ పొడిగింపు పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నట్లు ఈ సందర్భంగా ఏలూరి తెలిపారు.

రెండు ఓట్లు కలిగి ఉంటే ఏడాది జైలు

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న



మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యో తి): కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్ర కారం ఎవరైనా రెండు ఓట్లు కలిగి ఉంటే చ ట్ట ప్రకారం నేరమని ఆర్డీవో లక్ష్మీప్రసన్న పే ర్కొన్నారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో శనివారం గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు, చట్టప్రకారం రెండు ఓట్లు కలిగి ఉంటే ఎన్నికల నిబంధనల ప్రకారం సెక్షన్ 31, ఆర్‌పీఏ-1950 యాక్టు ప్రకారం ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయాల జరిమానా విధించాల్సి వస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎక్కడ నివాసం ఉంటే అక్క డే తమ ఓటుహక్కు కలిగి ఉండేలా రాజకీ యపార్టీలు సహకరించాలన్నారు. ప్రతినెలా గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధు లతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి నుం చి వచ్చే సూచనలు, సలహాలు తీసుకొని అం దుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఒంగోలు నియోజకవర్గంలో రెండేసి ఓట్లు కలిగి ఉన్నవారు ఒక ఓటును రద్దు చేసుకోవాలని కోరారు. రెండో ఓటును రద్దు చేసుకోకుంటే కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నేరంగా పరిగణించాల్సి వస్తోందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓట్ల కంటే ఎక్కువ కలిగిన బూత్‌ల్లోని ఓట్లను పక్కనే ఉన్న మరోక పోలింగ్ కేంద్రా నికి మారుస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ళు నిం డిన యువతీ, యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమం లో రాజకీయ పార్టీల నాయకులు స్వరూప్, ఎస్‌కే.రసూల్, డీఎస్.క్రాంతికుమార్, గుర్రం సత్యనారాయణ, డీటీ కృష్ణమోహన్, ఏసీపీ సుధాకర్, టీపీవో బాబురావు, రామ్‌భూపాల్ రెడ్డి, పద్మజ, నాయుడు, శేషుబాబు, సలోమి, సాయి, దాసు, మంజు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న ఎంఈవో వెంకారెడ్డి

సంతనూతలపాడు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంఈవో వెంకారెడ్డి తెలిపారు. శనివారం సంతనూతలపాడులోని షైనింగ్‌స్టార్ ఎలైట్ స్కూల్ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉంటోందని, తద్వారా కాలుష్యం పెరుగుతుందని చెప్పారు. అందువల్ల పర్యావరణ పరిరక్షణ కోసం విధిగా మొక్కలను నాటాలన్నారు. తద్వారా స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం లభిస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ఎంఈవో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సీహెచ్.అనిత, ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాతపరీక్షలో 'శ్రీవికాస్' ప్రతిభ



పావనిని అభినందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సివిల్ పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షల్లో ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు సత్తా చాటారు. అత్యధిక మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన దర్శికి చెందిన షేక్ ఫజులూన్ రాష్ట్ర స్థాయిలో 173వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపిక కాగా జె.పంగులూరుకు చెందిన పి.పావని 120 మార్కులతో ఉద్యోగానికి ఎంపికయారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కోచింగ్ సెంటరులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ వీరయ్య అభినందించారు. అలాగే శిక్షణ ఇచ్చిన అధ్యాకులను సత్కరించారు.

రైతుల అభ్యున్నతే ప్రజాప్రభుత్వ లక్ష్యం

● మారిటైం బోర్డు చైర్మన్ సత్య



మాట్లాడుతున్న దామచర్ల సత్య

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 2 : రైతుల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మండలంలోని కె.బిట్రగుంటలో శనివారం ఆ యన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ప్రా రంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సం దర్భంగా సత్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ ప థకాలను సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వ ర్యంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొ ద్దికాలంలోనే అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా పేదల కోసం అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నద న్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో నియో జకవర్గంలోని 36,808 మంది రైతులకు రూ. 25 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై యంత్ర పరికరాలు, డ్రోన్‌లు ఇస్తున్నదన్నారు. ఈనెల లోనే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందు తాయ న్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణ సౌకర్యం కూడా అమలులోకి వస్తుందని చెప్పారు. ఈసందర్భంగా దర్శి మండలం తూర్పువీరాయ పాలెం నుంచి సీఎం చంద్రబా బు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్స వ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారా యణ, ఎంపీపీ బెల్లం నిర్మల, టీడీపీ సీ నియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబా బు, దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

టంగుటూరు (కొండ పి): అన్నదాత సుఖీ భవ - పీఎం కిసాన్ పథకంలో తొలి విడత రూ.7 వేల ఆర్థిక సాయం అందించినందుకు కృతజ్ఞతగా ఎం.నిడమా లూరులో రైతులు సీ ఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. కాకుమాని శ్రీనివాస్, సురేష్, అన్నపరెడ్డి కనకరాజు, బెజవాడ శివ య్య, మాధవ, వాకా కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, కా వూరి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఖాతాల్లో రూ.4.44 కోట్లు జమ

పొన్నలూరు : అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద మండలంలోని 7,645 మంది రైతుల ఖాతాల్లో రూ.4.44 కోట్లు జమ అ య్యాయి. రైతు సేవా కేంద్రాల వద్ద శనివా రం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వ హించారు. పొన్నలూరులో వ్యవసాయాధికారి వి.రాము, టీడీపీ మండల నాయకుడు మం డవ మురళీమోహన్, వ్యవసాయ సహాయకు లు ఇ.సుధీర్, వెంకటనారాయణ, సుష్మ, సబి యా, రాకేష్, మౌలాలి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో శనివారం విద్యార్థులు విలువలతో వికాసం అనే అంశంపై నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఆరో తరగతి విద్యార్థులు తమ ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. నేటితరంలో నైతిక విలువల, మంచి ప్రదర్శన, సామాజిక బాధ్యతల అవసరాన్ని, దయ, నిజాయితీ, గౌరవం, సహకారం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భగా హెచ్‌ఎం శశిలక్ష్మి మాట్లాడు తూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతా యని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఉపాధి సొమ్ము రాలేదని కూలీల ఆందోళన



వేతనం రాలేదని ఆందోళన చేస్తున్న కూలీలు

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తాము ఉపాధి పనులు చేసి రెండు మాసాలు గడుస్తున్నా, ఇంత వరకు నగదు చెల్లింపులు జరగలేదని కూలీలు ఆందోళన చేపట్టారు. ఎస్ఎల్.గుడిపాడు పంచాయతీ శివారు గ్రామం సుజాత నగర్ కాలనీలో రోజు వారీ కూలీలు సుమారు వంద మంది పైబడి, మే, జూన్, మాసాల్లో ప్రతి రోజు ఉపాధి పనులకు వెళ్లారు. కాని ఇంత వరకు తమకు కూలి చెల్లింపులు చేయలేదని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రావాల్సిన కూలి నగదు సంగతి ఏమిటని అడిగిన ఎవరు సమాధానం చెప్పడం లేదని కూలీలు అరోపిస్తున్నారు. కూలి నగదు రాకపోవడంతో తాము ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమకు కూలి నగదు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న ప్రైవేట్ బస్సు

మోటర్ సైకిలిస్ట్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

మేదరమెట్ల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో పాత హైవేలో ప్రైవేట్ బస్సు మోటర్ సైకిలిస్ట్‌ను ఢీ కొన్న ఘటనలో మోటర్ సైకిలిస్టు అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం గ్రోత్ సెంటర్‌లోని గ్రానైట్ ప్యాక్టరీకి ఉద్యోగులను తరలించే బస్సు మోటర్ సైకిల్‌ను ఢీ కొట్టింది. అనమనమూరుకు చెందిన కవల సాంబశివరావు(45) మోటర్ సైకిల్‌పై వెళ్తాండగా కళ్యాణ మండపం ఎదురుగా ప్రైవేట్ బస్సు ఢీ కొంది. ప్రమాదంలో సాంబశివరావు తీవ్రంగా గాయపడి అ క్కడికి అ క్కడే చనిపోయ్యాడు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లతో కలిసి గ్రంథాలయం సందర్శన

పాత నేరస్థులకు సీఐ శేషగిరిరావు వినూత్న కౌన్సెలింగ్



గాంధీజీ చేతికర్రను పాతనేరస్థుకు చూపుతున్న సీఐ శేషగిరిరావు

వేటపాలెం (చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు నేరాలకు దూరంగా కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని, ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీజీ మార్గంలో నడవాలని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం రౌడీషీటర్లకు ఎస్సై జనార్ధన్‌తో కలిసి కౌన్సిలింగ్ నిర్వహించారు. వేటపాలెం లైబ్రరీలో గాంధీజీ వేటపాలెం పర్యటన సమయంలో వదిలి వెళ్లిన చేతి కర్రను ప్రదర్శిస్తూ, ఆ గ్రంథాలయంలో లభించే విలువైన పుస్తకాలపై నేరస్థులకు అవగాహన కల్పించారు. జీవితంలో ప్రతి గంట విలువైనదన్నారు. శిక్షలతో జైళ్లల్లో నలిగి పోవడం బాధాకరమని సూచించారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని హితవు పలికారు. కుటుంబంలో చిన్నారులకు చక్కగా చదివించి ఉన్నతంగా తీర్చి దిద్దాలని కోరారు. వారి వెంట లైబ్రరీయన్ శ్రీవల్లి ఉన్నారు.

పౌష్టికాహారంతోనే చక్కని ఆరోగ్యం

- నియోజకవర్గంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



ఈపూరుపాలెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్వాడీలు

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా పసిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఈపూరుపాలెం సూపర్‌వైజర్ ప్రసన్న, అర్బన్ సూపర్‌వైజర్ కవితశ్రీ అన్నారు. సీడీపీవో ఝాన్సీ సూచనల మేరకు శనివారం నియోజకవర్గం పరిధిలోని ఈపూరుపాలెం, చుక్కయ్యపేట, వాడరేవు, తోటవారిపాలెం, మున్సిపాలిటీ పరిధిలోని పాపరాజుతోట, వెంకటేశ్వరనగర్, ఉసిరికపాలెం ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహనతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్యవేదం, ఇంద్రాణి, రోజాకుమారి, గ్లోరీ, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్



డ్రోన్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్ ఏఐపై వర్క్‌షాపు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన అర్టిన్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్‌ల్యాబ్స్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణతో ఉపయోగకరమని చెప్పారు. ప్రిన్సిపల్ డా.జగదీష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక పీఠం చీరాల వారి ఆధ్వర్యంలో నేడు ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మబోధ అంశంపై జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు హాజరై మానసిక ప్రశాంతత పొందాలని పీఠం ప్రతినిధులు కోరారు.

రైతన్నా.. సుఖీభవ

- అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ
- చీరాల, అద్దంకిలో పాల్గొన్న ఎమ్మెల్యేలు
- ఖరీఫ్ ముంగిట రైతులకు సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

పాపాయిపాలెం(చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులను రాజులుగా మార్చే బాధ్యత కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా. చంద్రబాబు నాయుడు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శనివారం వేటపాలెం మండల పరిధిలోని పాపాయి పాలెంలో అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో రైతు సమస్యలు పరిష్కారం కావడం లేదని, సంక్షేమాలు అందడం లేదని' నటన పూర్వకమైన పరామర్శలకు జగన్‌రెడ్డి తెరలేపారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం సుమారు రూ.10 లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నట్లు చెప్పారు. అయినప్పటికీ, వెనక్కు తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పథకాలను దిగ్విజయంగా పూర్తి చేయగా. తాజాగా అన్నదాత సుఖీభవ, అలాగే ఈ మాసంలోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఈవిధంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుంటే తప్పుడు ప్రచారాలు చేస్తూ జగన్‌రెడ్డి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. వీలయినంత త్వరలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయన్నారు. ప్రభుత్వ సుభిక్షపాలన ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు వివరించారు. 7368 మంది రైతులకు రూ.4.59 కోట్లు చెక్కుల పంపిణీ చేశారు. అంతుకు ముందు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేసిన ప్రదర్శనలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, హ్యాండ్‌లూమ్ చైర్మన్ హేమలత, ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు, ఏడీఏ రత్నకుమారి, ఏవోలు నిర్మల, సరిత పాల్గొన్నారు.



చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అద్దంకిటౌన్ : రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అద్దంకి ఏఎంసీ కమిటీ ఉపాధ్యక్షుడు ధర్మవరపు నాగేశ్వరరావు అన్నారు. శనివారం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మూడు విడతలలో ఒక్కో కుటుంబానికి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు బిందు, తుంపర సేద్య పరికరాలు రాయితీపై అందిస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటి మాజీ చైర్మన్, టీడీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యాక్షుడు నాగినేని రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తోందన్నారు. దాని కోసం ప్రభుత్వం రూ.300 కోట్లు విడుదల చేసిందన్నారు. 80శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్‌లు అందిస్తుందన్నారు. ఏడీఏ బి.ఎఫ్రాయిం మాట్లాడుతూ నియోజకవర్గంలో 40288 మంది రైతు కుటుంబాలకు రూ.27.62 కోట్ల పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సహాయం రైతుల ఖాతాలల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీచరణ్ మాట్లాడుతు జిల్లాలో ఎక్కువ మంది రైతులు అద్దంకి నియోజకవర్గం రైతులు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా ఎ వరైనా ఆధార్ తప్పుగా ఉన్న రైతులు వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు సంబంధించి ప్రాపర్ పర్సన్ సర్టిఫికెట్ తీసుకుని ప్రభుత్వ పథకం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పర్చూరు : రైతులకు వెన్నుదన్నుగా ప్రజా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతాంగానికి టీడీపీ, జనసేన, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు జమచేయనున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం నిధులు జమచేసే పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ సాగు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు మొత్తం ఏడాదికి రూ.20వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తున్నట్లు ఏలూరి పేర్కొన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4685838 రైతు ఖాతాల్లో రూ.3174 కోట్లు జమ చేయటం జరుగుతుందన్నారు. ఒక్క పర్చూరు నియోజకవర్గంలో 37,861 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.26,19,000 కోట్లు జమ కానున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెనువెంటనే రైతులకు అవసరమైన వ్యవసాయ ఉపకరణాలు, డ్రోన్‌లు, విత్తనాల సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. కొమ్మమూరు కాలువను అధునీకరించి చివరి భూములకు వరకు సాగునీరు అందించే విధంగా ప్రస్తుతం పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, డ్వామా పీడీ విజయలక్ష్మీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఏడీఏ ప్రవీణ, ఎంపీడీవో ప్రద్యూమ్నా కుమార్, తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, ఏవో భాస్కర్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వం క్విజ్ పోటీలలో కేఆర్‌కే విద్యార్థుల ప్రతిభ



పోటీలలో విజేతలైన విద్యార్థులతో అధ్యాపకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ కళాశాల విద్యార్థులు విజయం సాధించి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం కళాశాల నందు ప్రిన్సిపాల్, అధ్యాపకులు విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టం-2005 వచ్చి రెండు దశబ్ధాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వివిధ స్థాయిలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించింది. అందులో భాగంగా ఒంగోలులోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎన్ఆర్‌సీ ఒంగోలు స్థాయిలో వివిధ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబెట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. వక్తృత్వం పోటీలలో ఆకాష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. క్విజ్ పోటీలలో ఆకాష్, తిరుపతమ్మ, లెనిన్ బృందంకి ప్రథమ స్థానం సాధించారు. డిబెట్‌లో ఆకాష్, రేణుకలు ద్వితీయ స్థానం సాధించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణి అభినందించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 6న గుంటూరు ప్రభుత్వ కళాశాలలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు తెలిపారు. విజేతలుగా నిలిచి కళాశాలకు పేరు తెచ్చిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పంట పొలాల ముంపు సమస్యకు పరిష్కారం



పొలాల్లోని నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న తూములు

పర్చూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి 167(ఏ) విస్తరణలో భాగంగా పర్చూరు మండల పరిధిలోని తిమ్మరాజుపాలెం గ్రామం సమీపంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణంతో వ్యవసాయ భూములకు వెళ్లే డొంకలు మూసుకుపోయాయి. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోయి పంట పొలాలు ముంపునకు గురయ్యే పరిస్థితి నెలకొంది. దీనిపై చర్యలు చేపట్టాలని అధికారులకు రైతులు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో రైతులు రోడెక్కి నిరసన గళం సైతం వినిపించారు. అయినప్పటికీ, సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. జాతీయ రహదారి పనులు చేపడుతున్నా, వాహనాలను నిలిపివేసి రోడ్డుపై పెద్దఎత్తున బైఠాయించి నిరసనలు తెలిపారు. రైతులు పడుతున్న ఇబ్బందులతో పాటు సమస్య తీవ్రతను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జాతీయ రహదారి కాంట్రాక్టు ప్రతినిధులతో పాటు, అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దీంతో హైవే యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలకు శ్రీకారం చుట్టింది. చర్యల్లో భాగంగా భూములకు వెళ్లే డొంకదారులకు 26 తూములను ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొందించి పనులు చేపట్టారు. అదేవిధంగా గ్రామం సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద మురుగునీరు పంటపొలాల్లోకి వెళ్లకుండా సిమెంట్ కాలువను ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

శింగరకొండ దేవస్థాన ట్రస్టీల నియామకం



ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

అద్దంకి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ట్రస్టీలను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. ట్రస్టీలుగా గుంజి శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు, రుద్రు ఆదిలక్ష్మి, కొడిమెల కోటేశ్వరమ్మ, చీమలదిన్నె వెంకటరమణ, కస్తూరి లక్ష్మీప్రసూన, బత్తుల సరిత, అద్దంకి ఆదిలక్ష్మిలతో పాటు ఎక్స్‌అఫీసియో సభ్యులుగా భాగవతుల నరసింహచార్యులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో గుంజి శ్రీనివాస రావును చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు.

భక్తుల కోలాహలం



లక్ష్మీనరశింహస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

అద్దంకి : శింగరకొండకు శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గొర్రెల కాపరులు తమ గొర్రెల మందలతో వచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆకు పూజలు, వాహన పూజలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గొర్రెల మందలకు రంగులు చల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు.

న్యాయాధికారి పూజలు

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీ నరశింహస్వామి దేవాలయాలలో శనివారం అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పూజారులు ఆశీర్వదించి, సత్కరించారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల

బల్లికురవ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుధ తెలిపారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో కిషోర వికాసం అనే కార్యక్రమంలో భాగంగా తల్లి పాల వారోత్సవల గురించి వివరించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన పొందాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ విజయనిర్మలా అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కొత్తవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఓవర్ హెడ్‌ట్యాంక్ కూల్చివేత పనులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, గీతామందిరం రోడ్డు పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురుని కోర్టు లో హాజరుపరచగా న్యాయాధికారి అఖిల రూ.8 వేల అపరాధ రుసుము విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. మద్యంసేవించి ద్విచక్ర వాహనం నడిపిన ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ.3 వేల అపరాధరుసుము విధించినట్లు తెలిపారు.

రుణాలు వసూలు చేయని సిబ్బందిపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాద్‌బాబు

అద్దంకిటౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల వద్ద పేరుకుపోయిన మొండి బాకాయిల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని వారం రోజులల్లో వసూళ్ల చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపిఎం జ్యోతి ప్రసాద్‌బాబు అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘ అధ్యక్షులు, సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపియం మాట్లాడుతు మండలంలోని ఆ యా గ్రామాల పరిధిలో సిఐఎఫ్, ఉన్నతి, 70 లక్షలు, స్త్రీ నిధి 38 లక్షలు బకాయిలు పేరుకుపోయాయని, వాటి వసూళ్లకు సిబ్బంది, వి వోఏలు, గ్రామ సంఘ ప్రతినిధులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, సిసిలు బ్రహ్మయ్య, విజయరాణి, యేసయ్య, అకౌంటెంట్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పుస్తకాల పంపిణీ

యద్దనపూడి,(మార్టూరు)ఆగస్టు2(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, వారికి పుస్తకాలను, పతకాలను బహుమతిగా అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ దార్ల బుజ్జిబాబు, చంద్రం, ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ



పెన్షన్ అందుకున్న మహిళలతో అధికారులు, టీడీపీ నాయకులు

మార్టూరు, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్టూరు పట్టణంలో 32 మంది మహిళలకు కొత్తపెన్షన్లను పంపిణీ చేశామని టీడీపీ పట్టణ అధ్యక్షులు కామినేని జనార్ధన్ అన్నారు. శనివారం మార్టూరులో గ్రామ పంచాయతీ ఆవరణలో నాలుగు సచివాలయాల పరిధిలోని 32 మందికి కొత్తగా మంజూరైన పెన్షన్లను నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో తస్నీరు శ్రీనివాసరావు, నాయకులు షేక్ రజాక్, తొండెపు ఆదినారాయణ, జంపని శ్రీను, కమ్మ శివనాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకట్రావు, రామకృష్ణ, మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా పాల్గొన్నారు.

ప్రజాక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన

- దేశాయిపేటలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

దేశాయిపేట(చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాక్షేమమే లక్ష్యంగా నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ రామనగర్‌లో నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్, యువనాయకులు గౌరీ అమరనాథ్‌తో కలిసి సుపరిపాలన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అభివృద్ధి పనులను వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలు స్వీకరించారు. ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

చీరాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ప్రయాణి కుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చీరాల - స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. మృతుని వద్ద ఎటువంటి ఆనవాళ్ల లేవు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

దేశాయిపేట (చీరాల), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయిపేట ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసాయి పిల్లలు, చెవి, ముక్కు, గొంతు వైద్యశాల వైద్యులు డా.ఎన్ రవికుమార్, డా.సాయిస్వరూప్ డాక్టర్ శృతి పాల్గొని చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.